
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 42.6; కనిష్ఠం 32.4
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
సోమవారం 22 ఏప్రిల్ 2024



పలు మండలాల్లో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 21: కామారెడ్డి జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. బాన్సువాడ మండలం కొల్లూర్‌లో 41.8, గాంధారిలో 41.6, తాడ్వాయిలో 41.5, రామారెడ్డిలో 41.2, బిచ్కుందలో 41.1, మద్నూర్ మండలం మేనూర్‌లో 40.7, పాల్వంచ మండలం ఎల్పుగొండలో 40.7, బీర్కూర్ 40.2, పిట్లం, జుక్కల్, నస్రుల్లాబాద్, గాంధారి మండలం సర్వాపూర్‌లలో, నిజాంసాగర్ మండలం హసన్‌పల్లిలో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



పోటాపోటీ ప్రచారం

- లోక్‌సభ ఎన్నికల్లో వేడెక్కిన రాజకీయం
- వేగం పెంచిన పార్టీ అభ్యర్థులు
- నామినేషన్లు వేయడంలో నిమగ్నం
- బహిరంగ సభలకు ఏర్పాట్లు
- పోలింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో దూకుడు

కామారెడ్డి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల ఘట్టం మొదలైనందున ఒక వైపు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తూనే ప్రచారంలో వేగం పెంచుతున్నారు. జహీరాబాద్ లోక్‌సభ స్థానానికి తమ అభ్యర్థిత్వం ప్రకటించినప్పటి నుంచే ఎన్నికల వేడి రాజుకోగా పోలింగ్ తేదీ సమీపిస్తున్న కొద్ది వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఊపుతో ఉండగా బీఆర్‌ఎస్ పార్టీ తమ సిట్టింగ్ స్థానాన్ని పదిలపరుచుకునేందుకు ఆరాటపడుతోంది. ఇక బీజేపీ ఈసారి ఎలాగైన జహీరాబాద్‌లో పాగా వేయాలని పట్టుదలతో ఉంది. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు విమర్శలు చేస్తూ ప్రచారంలో తమదైన శైలిలో దూసుకెళ్తున్నారు. నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుండడంతో అభ్యర్థులు దానిపై నిమగ్నమయ్యారు. నామినేషన్‌లు వేస్తూనే రాష్ట్రస్థాయి ముఖ్యనేతలతో సమావేశాలు ఏర్పాటు చేసేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్, బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్, బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ ఎవరి శైలిలో వారు ప్రచారం ముమ్మరం చేశారు. నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు పూర్తికావడంతో క్షేత్రస్థాయిలో ప్రజల మద్దతు కోసం తమ ప్రయత్నాలు చేస్తున్నారు.

నామినేషన్లు వేస్తున్న అభ్యర్థులు

జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో పోటీచేసే అభ్యర్థులు నామినేషన్లు వేస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు ఇతర పార్టీల్లో స్వతంత్రులుగా పోటీ చేసేవారు సైతం నామినేషన్‌లు దాఖలు చేస్తున్నారు. ఇప్పటికే ప్రధాన పార్టీలకు చెందిన సురేష్ షెట్కార్, గాలి అనిల్ కుమార్, బీబీ పాటిల్‌ల తరఫున ఓ సెట్ నామినేషన్లను ఆయా అనుచరులు వేశారు. నేడు బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ కేంద్ర మంత్రి పియూష్ గోయల్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీతో నామినేషన్ వేయనున్నారు. 24న కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ నామినేషన్ వేయనున్నారని ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో నామినేషన్ దాఖలు చేశారు.

బహిరంగ సభలకు సన్నద్ధం

రాష్ట్ర, జాతీయస్థాయి నాయకులతో భారీ బహిరంగ సభలకు ప్రణాళికలు వేస్తున్నారు. కామారెడ్డి జిల్లా పరిధిలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లో సభలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. అధిక ఓట్ల కోసం జిల్లా కేంద్రంతో పాటు నియోజకవర్గాలు మండల కేంద్రాల్లోనూ సభలు జరగనున్నాయి. ఎక్కడికక్కడ నియోజకవర్గాల ఇన్‌చార్జీలను నియమించుకుని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. నామినేషన్‌లు పూర్తికాగానే జిల్లా పరిధిలోని నాలుగు నియోజకవర్గాల్లో కేంద్ర, రాష్ట్రస్థాయి నేతలతో సభలు, సమావేశాలు నిర్వహించనున్నారు. రాబోయే నెలరోజులు మరింత దూకుడుగా అభ్యర్థులు వ్యవహరించనున్నారు.

హోరెత్తనున్న ప్రచారం

కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ ఈ ఎన్నికలను సవాళ్లుగా తీసుకుంటుండడంతో రానున్న రోజుల్లో ప్రచారం హోరెత్తనుంది. ఇప్పటికే ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ఓ దఫా ప్రచారాన్ని పూర్తి చేశారు. ఇటీవల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడం, నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. నామినేషన్ల సమయంలోనే అభ్యర్థులు తమ పార్టీ తరఫున చరిష్మా ఉన్న నేతలను పిలిపించుకుని నామినేషన్‌లు వేస్తు ర్యాలీలు, సభలు నిర్వహిస్తున్నారు. ఈనెల 25తో నామినేషన్ల పర్వం ముగియనుంది. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయనున్నారు. అసెంబ్లీ ఎన్నికల విజయం ఊపుతో కాంగ్రెస్ ప్రచారాన్ని హోరెత్తనుంది. ప్రజా సమస్యల పోరు ఎజెండాతో బీఆర్‌ఎస్ ప్రజల ముందుకు వెళ్లనున్నారు. దేశంలో మరోమారు మోదీ సర్కార్ నినాదంతో పోరుకు సిద్ధం అయింది.

ప్రైవేట్ ఆస్పత్రుల ఇష్టారాజ్యం!

- చిన్న రోగమైనా పెద్దదిగా చూపిస్తూ రూ. లక్షల్లో వసూళ్లు
- యథేచ్ఛగా పీఎంపీ, ఆర్‌ఎంపీల కమీషన్ల దందా
- ఆసుపత్రుల్లో చాలా వరకు సొంత మెడికల్ షాపుల నిర్వహణ
- తమ ఆసుపత్రిలో వందల ఓపీ అంటూ అసత్య ప్రచారాలు



భిక్కనూరు, ఏప్రిల్ 21: వైద్యుడు దేవుడితో సమానమంటారు. ఇందులో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా కొందరు ప్రజలకు తక్కువ ఖర్చుతో సేవ చేస్తుంటే మరికొందరు అక్రమార్జనే ధ్యేయంగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దేవుడిలా కొలిచే వైద్యులు కొందరు ప్రైవేటు ఆసుపత్రులను నెలకొల్పి తక్కువ కాలంలోనే కోట్లు సంపాదిస్తున్నారు. చిన్నా.. పెద్ద తేడా లేకుండా పలు ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే వారిని పరీక్షలు, ఒంట్లో కొద్దిగా బాగోలేకపోయినా పెద్దపెద్ద రోగాలను అంటగట్టి భయభ్రాంతులకు గురిచేస్తూ అందినకాడికి అమాయకుల నుంచి దండుకుంటున్నారు. ఇలాంటి వారు గ్రామాల్లో, మండల కేంద్రాల్లో ఉండే కొందరు ఆర్‌ఎంపీ, పీఎంపీలకు, ఆసుపత్రుల సమీపంలో ఉండే పలు రకాల పరీక్ష, ఎక్స్‌రే నిర్వాహకులకు కమీషన్ల ఆశ చూపి దందాను మూడు సిరంజీలు, ఆరు మందు గోలీలుగా రోజురోజుకూ దినదినాభివృద్ధి చెందుతున్నారు. ప్రస్తుతం ఎవరైనా వైద్యం కోసం ఆసుపత్రికి వస్తే చాలు కొందరు ప్రైవేటు ఆసుపత్రి వారు పండుగ చేసుకుంటున్నారు. వైద్యం కోసం వచ్చే వారికి ముందుగా ఓపీ ఫీజుతో పాటుగా రకరకాల పరీక్షల పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారు. పైగా ఆయా ఆసుపత్రుల్లో సొంతంగా వారి బంధువులు, కుటుంబ సభ్యులతో మెడికల్ షాపులను నిర్వహిస్తూ ఎక్కువ లాభం ఆర్జిస్తున్నారు. గ్రామాల్లో పెద్దపెద్ద హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తూ వారి భారాన్ని సైతం వైద్యం కోసం వచ్చే వారిపై రుద్దుతున్నారు.

ఇష్టారాజ్యంగా వసూళ్లు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం కోసం వచ్చే వారికి ఆయా ఆసుపత్రుల యాజమాన్యాలు భయభ్రాంతుకు గురి చేస్తున్నాయి. జ్వరం, దగ్గు, మలేరియా, పంటి నొప్పి, మోకాళ్ల నొప్పులు, చిన్న పిల్లలకు సమస్యల లాంటి చిన్నచిన్న రోగాలకు వైద్యం కోసం వెళ్తే వారికి సదరు వైద్యులు రకరకాల పరీక్షలు నిర్వహించి పెద్ద రోగంగా చూపిస్తూ వారి వద్ద లక్షలు వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి మెడ నొప్పితో మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన ఒకరు తన భార్యను తీసుకురాగా రూ.300 ఓపీ ఫీజుతో పాటుగా అదే ఆసుపత్రిలో నరాలకు సంబంధించిన ఇతర పరీక్షలు చేసి రూ.6500లను వసూలు చేసి రిపోర్టు మూడు రోజుల్లో వస్తుందని అప్పటి వరకు కొన్ని మందులు రాసి అదే ఆసుపత్రిలో ఉన్న మెడికల్ షాపులో తీసుకొమ్మని రూ.2800ల మందులు, టానిక్‌లను రాశాడు. మొత్తంగా మెడ నొప్పితో వెళ్తే ఒకే రోజులో రూ.9900లు అయ్యాయని సదరు వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశాడు. అనంతరం వైద్యుడు సూచించిన మేరకు మూడు రోజుల తర్వాత ఆసుపత్రికి వెళుతూ మెడ భాగంలో చిన్న సమస్య ఉందని రెండు రోజులు జాయినింగ్ చేసుకుని రూ.36వేల బిల్లు వేశాడు. ఇలాంటి సంఘటనలు ఉమ్మడి జిల్లాలో చాలానే జరుగుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్న పరిస్థితి. చిన్న సమస్య అని వెళ్తే పెద్ద రోగమంటూ భయపెట్టి రూ.లక్షలు గుల్ల చేస్తున్నారని పెద్దఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కమీషన్ల కోసం రోగులను ఆసుపత్రులకు తరలిస్తున్న పీఎంపీ, ఆర్‌ఎంపీలు

గ్రామాల్లో ఉండే కొందరు పీఎంపీ, ఆర్‌ఎంపీలకు కమీషన్ల ఆశ చూపి వారివారి ప్రైవేటు ఆసుపత్రులకు రిఫర్ చేయించుకుంటు కొత్త రకం కొందరు ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు కొత్త దందాను కొనసాగిస్తున్నాయి. తమ ఆసుపత్రికి ఒకరిని పంపిస్తే ఇంత ఇద్దరిని పంపిస్తే ఇంత కమీషన్ ఇస్తామంటూ ఆర్‌ఎంపీ, పీఎంపీలకు నిత్యం టచ్‌లో ఉంటున్నారు. కమీషన్లకు ఆశపడిన కొందరు ఆయా ప్రైవేటు ఆసుపత్రులకు చిన్న చిన్న రోగానికి సైతం రిఫర్ చేస్తున్నట్లు సమాచారం. ఇలా పలు ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు రోజురోజుకూ కొంత పుంతలు తొక్కుతూ వైద్యాన్ని వ్యాపారంగా మార్చుకుని కోట్లు గడిస్తున్నారు. వీరితో పాటుగా పలు రకాల పరీక్షలని వారికి కమీషన్లు ఇచ్చే పరీక్షా కేంద్రాలకు రిఫర్ చేసి మరి అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు.

ఆసుపత్రుల్లోనే మెడికల్ షాపుల నిర్వహణ

చాలా వరకు ప్రైవేటు ఆసుపత్రుల్లో వారివారి కుటుంబ సభ్యులు, బంధువులతో మెడికల్ షాపులను నిర్వహిస్తున్నారు. ఆయా ప్రైవేటు వైద్యులు రాసిచ్చిన మందులను ఆ ఆసుపత్రుల్లోని మెడికల్ షాపుల్లోనే కొనుగోలు చేసేలా రోగులకు సూచిస్తున్నారు. ఆ మెడికల్ షాపుల్లో సదరు వైద్యుడు రాసిన మందులను చాలా వరకు అధిక ధరను విక్రయిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి మెడికల్ షాప్‌లను తనిఖీ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నా వారిని అడ్డుకోవాల్సిన అధికారులు పట్టించుకోడం లేదని ఆరోపిస్తున్నారు.

తమ ఆసుపత్రిలో అనేక ఓపీలంటూ అసత్య ప్రచారాలు..

చాలా ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇష్టారాజ్యంగా ఓపీ ఫీజును వసూళ్లు చేస్తున్నారు. ఒక ఆసునత్రిలో రూ.200 ఉంటే మరో ఆసుపత్రిలో రూ.300 ఇలా రూ.500ల వరకు ఆయా ప్రైవేటు ఆసుపత్రుల్లో వసూళ్లు చేస్తున్నారు. పలు ఆసుపత్రుల్లో ఉదయం 6 గంటల నుంచి ఓపీ వచ్చినప్పటికీ గత రాత్రి నుంచే ఓపీ రాయించుకున్నారని ప్రస్తుతం 100కు పైగా ఓపీ ఉందని అసత్యపు ప్రచారాలు చేసుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారు. ఒక రోజు దాదాపు 100 ఓపాలు చూడటానికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇద్దరు, ముగ్గురు వైద్యుల వరకు ఉంటే పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మరల మూడు గంటల నుంచి రాత్రి వరకు ఒకరే వైద్యుడు 300ల ఓపీలను చూస్తున్నట్లు సమాచారం. ఇలా పలువురు ప్రైవేటు వైద్యులు అక్రమార్జనే ధ్యేయంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ మంచి సేవ చేస్తున్న వైద్యులకు సైతం చెడ్డపేరును తెస్తున్నారు.

నేడు నిజామాబాద్ రానున్న సీఎం రేవంత్‌రెడ్డి

- పాత కలెక్టరేట్ మైదానంలో బహిరంగసభ
- ఏర్పాట్లను పర్యవేక్షించిన నేతలు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 21: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం నిజామాబాద్ జిల్లాకు రానున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటి సారి జిల్లాకు రానున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జీవన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో సీఎం పాల్గొననున్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నారు. ఈ మేరకు జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల అనంతరం సీఎం జిల్లా కేంద్రానికి రానున్నారు. దుబ్బ ప్రాంతంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో సీఎం కోసం హెలిప్యాడ్‌ను సిద్ధం చేశారు. అక్కడి నుంచి పాత కలెక్టరేట్ మైదానానికి సీఎం చేరుకుంటారు. సీఎం సభను జయప్రదం చేసేందుకు జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం సీఎం సభకు సంబంధించిన ఏర్పాట్లను ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ తదితరులు పరిశీలించారు.



ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ

రామారెడ్డి, ఏప్రిల్ 21: రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్న ప్రజల సంక్షేమం కోసం పథకాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. ఆదివారం రామారెడ్డి మండలం రెడ్డిపేట గ్రామంలో జహీరాబాద్ పార్లమెంటరీ కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైన అమలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, గృహ అవసరాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10లక్షల వైద్య సదుపాయం లాంటివి అమలు చేస్తున్న ప్రభుత్వం దేశంలో ఎక్కడైన ఉందా అని అన్నారు. రాబోయే వానాకాలం నుంచి ఏటా ఎకరానికి రూ.15వేల రైతు భరోసాతో పాటు వరి ధాన్యం క్వింటాల్‌కు రూ.500ల మద్దతు ధర అదనంగా అందిస్తామని తెలిపారు. బీబీ పాటిల్ గత 10 ఏళ్లలో జహీరాబాద్ నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పి తర్వాత ఇప్పుడు ఏం చేస్తారో చెప్పాలని సవాల్ విసిరారు. అత్యంత పని చేయని ఎంపీ బీబీ పాటిల్ అని ఎంపీ నిధులు తిరిగి కేంద్రానికి పంపించిన వ్యక్తి అని అన్నారు. త్యాగాల చరిత్ర కాంగ్రెస్ పార్టీదని అన్నారు. మళ్లీ ఇందిరమ్మ రాజ్యం రావాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని తెలిపారు. అనంతరం 150 మంది బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్, జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, జడ్పీటీసీ నారెడ్డి మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు నర్సాగౌడ్, ధన్‌సింగ్, భాస్కర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

తరుగుపై అధికారుల విచారణ

బీర్కూర్, ఏప్రిల్ 21: ధాన్యం కొనుగోళ్లు చేపట్టిన అనంతరం ధాన్యాన్ని రైస్‌మిల్లుకు తరలించగానే రైస్‌మిల్లర్లు తరుగు పేరిట క్వింటాల్‌కు 5 కిలోల కోత విధించి తమను దోచుకుంటున్నాని బీర్కూర్‌కు చెందిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయమై రైతులు శనివారం బీర్కూర్ విండో కార్యాలయానికి చేరుకుని సిబ్బందిని నిలదీశారు. సహకార సంఘం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సంబంధిత అధికారులు స్పందించి ఆదివారం డీఏసీ ఎస్‌వో మల్లికార్జున్‌బాబు, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం నిత్యానంద్, సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సురేష్‌బాబులు బీర్కూర్ వచ్చి విచారణ చేపట్టారు. ధాన్యం కొనుగోళ్లు ఎందుకు నిలిపివేశారని విండో కార్యదర్శిని ప్రశ్నించారు. ఆయన చెప్పిన సమాధానంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైస్‌మిల్లులో తరుగుపేరిట క్వింటాల్‌కు 5కిలోల చొప్పున ఎందుకు కోత విధిస్తున్నారని ప్రశ్నించారు. తరుగు, కొనుగోళ్ల నిలిపివేతపై అధికారులు రెండు గంటల పాటు విచారణ చేపట్టి ఎలాంటి పరిస్థితుల్లోనైన ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని, కొనుగోళ్లను వేగవంతం చేయాలని అధికారులు విండో సిబ్బందికి సూచించారు. రైస్‌మిల్లర్లు తరుగు పేరిట కోత విధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



విచారణ చేపడుతున్న అధికారులు

పల్లె ప్రజలను కుదేలు చేస్తున్న గుడుంబ మహమ్మారీ!

- బానిసలవుతున్న పల్లె ప్రజలు
- పెద్ద దిక్కును కోల్పోయి వీధిన పడుతున్న కుటుంబాలు
- గుడుంబా నివారణకు చర్యలేవి ?
- కళ్లు అప్పగించి చూస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

బాన్సువాడ, ఏప్రిల్ 21: పచ్చటి పల్లెలను గుడుంబా మహమ్మారీ పట్టి పీడిస్తోంది. కొంత మంది అక్రమార్కులు పని కట్టుకొని గుడుంబాను రహస్య స్థావరాల్లో తయారు చేస్తున్నారు. అనంతరం దానిని ప్యాకెట్లలో నింపుతూ పల్లె ప్రజలకు చౌక ధరలకే విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటు న్నారు. గుడుంబాను శాశ్వతంగా నివారించామని గొప్పలు చెప్పుకునే ఎక్సైజ్ అధికారులు పల్లెలవైపు కన్నెత్తి చూడక పోవడం పలు విమర్శలకు తావిస్తుంది. పల్లెల్లో నాటుసారా తయారు చేస్తూ విక్రయిస్తున్నారని అధికా రులకు సమాచారం అందించడం, అధికారులు వారిని పట్టుకవచ్చి అందిన కాడికి దండుకొని వారిని వదిలిపెట్టడం రివాజుగా మారింది. జిల్లాలో ఏ పల్లె చూసిన, ఏ తండా చూసిన గుడుంబాతో గుప్పుమంటున్నాయి. పల్లెల్లో, తండా శివారులోని పంట పొలాల్లో చెరుకు తోట చేనులలను, మొక్కజొన్న చేనుల వద్ద గుడుంబా బట్టిలను రహస్యంగా ఏర్పాటు చేస్తున్నారు. రాత్రి వేళల్లో గుడుంబా బట్టీల నుంచి నాటుసారాను పల్లె ప్రాంతాలకు తరలించి ప్యాకెట్లలో విక్రయిస్తున్నారన్న సమాచారం వినబడుతుంది. కొందరు గుడుంబా వ్యాపారం చేసే వ్యక్తులు పల్లె ప్రజలను బానిసలు చేసి గుడుంబా మత్తును దించి వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు. గుడుంబాకు బానిసైన కుటుంబాల్లో పెద్ద దిక్కు కోల్పోయి కుటుంబాన్ని పోషించుకోలేని స్థితిలో కొన్ని కుటుంబాలు ఉన్నా యంటే గుడుంబా మహమ్మారి ఎంత వ్యాపిస్తుందో ఇట్టే అర్థమవు తుంది. ప్రాణాలు కోల్పోయిన కుటుంబ సభ్యు లు తమ పిల్లలను పోషించుకోలేక కూలీ నాలి పని చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నప్పటికి సమాజంలో జీవనాన్ని కొనసాగించుకోలేక మృత్యువాత పడుతున్న కుటుంబాలు పల్లెల్లో, కానీ తండా ప్రాంతాల్లో ఎన్నో కనిపిస్తాయి. ఇన్నీ సంఘటనలు జరుతున్న ఎక్సైజ్ శాఖ మాత్రం నివారించకుండా కళ్లు అప్పగించి చూడడం బాధాకరం. జిల్లాలోని బాన్సువాడ నియోజకవర్గంలోని వర్ని మండలంలోని తండాల్లో జోరుగా గుడుంబా వ్యాపారం సాగు తుంది. బాన్సువాడ మండలంలోని పలు తండా ల్లో, జుక్కల్ నియోజకవర్గంలోని తండాలతో పాటు గాంధారి మండలంలోని తండాల్లో గుడుంబా గుప్పుమంటుంది. ఈ ప్రాంతాల్లో ఎక్కువగా తండాలు ఉండడంతో గుడుంబా వ్యాపారం పెద్ద ఎత్తున సాగుతుందని అక్కడి ప్రజలు చర్చించుకోవడం గమనార్హం. నిజామాబాద్ రూరల్ ప్రాంతంలో గుడుంబా మూడు పూవులు ఆరు కాయలు గా కొనసాగుతుంది. ఇదిలా ఉంటే ఎక్సైజ్ శాఖ అధికారులు గుడుం బా స్థావరాల పై సమాచారం అందించినప్పటికి తూతూ మంత్రంగా తనిఖీలు చేపడుతూ కళ్లు అప్పగించి చూసిన సంఘటనలు ఉన్నాయని పలువురు చర్చించు కోవడం విశేషం. అంతే కాకుండా గుడుంబాను తయారు చేస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నప్పటికి వారిపై ఎలాంటి కేసులు పెట్టకుండా బేర సారాలాడి వదిలి పెట్టిన సంఘటనలు కోకొల్లలు. ఇంత జరుగుతున్న ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు మాత్రం గుడుంబా నివార ణకు ఎన్ని ప్రత్యేక చర్యలు చేపట్టి క్షేత్ర స్థాయిలోని ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నరని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు గుడుంబా నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టి క్షేత్ర స్థాయిలో రహస్య స్థావరాల్లో తయారు చేస్తున్న గుడుంబా బట్టీలను ధ్వంసం చేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని, పల్లె, తండా ప్రజలు కోరుతున్నారు.

భీమ్‌గల్ మున్సిపాలిటీ అంతా అవినీతి మయం

- పదుల సంఖ్యలో అనుమతులు లేని గృహనిర్మాణాలు, ఖాళీ స్థలాలకు ఇంటినంబర్ల కేటాయింపు
- పట్టించుకోని మున్సిపల్ కమిషనర్
- ప్రజలకు అందుబాటులో లేని పాలకవర్గం
- కోట్లలో ఆదాయం.. అభివృద్ధి శూన్యం

భీమ్‌గల్‌రూరల్, ఏప్రిల్21: భీమ్‌గల్ మున్సిపాలిటీలో అవినీతి కంపుకొడుతోందని ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. పదుల సంఖ్యలో అనుమతులు లేని గృహనిర్మాణాలు, ఖాళీ స్థలాలకు ఇంటినంబర్ల కేటాయింపు ఇంత జరుగుతున్నా తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్న మున్సిపల్ కమీషనర్, పత్తాలేని టౌన్‌ప్లానింగ్ అధికారి, ప్రజలకు అందుబాటులో లేని పాలకవర్గం, కోట్లలో ఆదాయం, అభివృద్ధి మాత్రం శూన్యం అన్న చందంలా మారింది భీమ్‌గల్ మున్సిపాలిటీ దుస్థితి. సంవత్సరానికి సుమారు రెండు కోట్ల ఆదాయం ఇంటి పన్నులు తదితర మార్గాల ద్వారా ఆదాయం సమకూరుతోంది. ఆదాయానికి, వ్యయానికి ఎక్కడా కూడా పొంతన లేకుండా ఇష్టమొచ్చిన తీరుగా మున్సిపాలిటీ అధికారులు పిచ్చి లెక్కలు చూపుతూ అభివృద్ధిని మరుస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

● అంతా అవినీతి మయం

భీమ్‌గల్ మున్సిపాలిటీలో కొంతకాలంగా పలు విభాగాల్లో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా శానిటేషన్ విభాగంలో ఆటోలు, ట్రాక్టర్లు, జేసీబీల మరమ్మత్తులకు మున్సిపల్ శాఖ అధికారులు ఒక్క ఏడాదిలోనే పొంతన లేని ఖర్చు లు చూపెట్టారని కౌన్సిలర్ లే బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. వాహనాల మరమ్మత్తుల పేరిట దోపిడీకి పాల్పడుతున్నారని, శానిటేషన్ పై పూర్తిస్థాయిలో గత నాలుగు సంవత్సరాల రికార్డులు పరిశీలిస్తే కోట్లతలో అవినీతి జరిగిందని పూర్తి



భీమ్‌గల్ మున్సిపాలిటీ ముఖచిత్రం

స్థాయిలో విచారణ చేపడితే అనేక విషయాలు బయట పడుతాయని కౌన్సిలర్లే పేర్కొనడం ఇందుకు నిదర్శనం. అలాగే వాహనాల్లో పోసే డీజిల్‌లో సైతం అవినీతి జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటి వరకు అధికారులు నమోదు చేసిన వాహనాల స్టాక్ రిజిస్టర్లు, రిపేర్ల రిజిస్టర్, పాత సామానుకు సంబంధించిన రిజిస్టర్, అలాగే పారిశుద్ధ్యానికి వినియోగించే కెమికల్స్ కు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లు, కొద్ది కాలంగా వేసిన టెండర్ల ప్రాసెస్ ఫైల్స్ ను సంబంధిత శాఖ పై అధికారులు పరిశీలిస్తే మున్సిపాలిటీ లో పేరుక పోయిన అవినీతి బయట పడుతుందని ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. శానిటేషన్ శాఖలో అధికారులే ఇష్టారాజ్యంగావ్యవహరిస్తున్నారని ప్రజలు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని కౌన్సిలర్ లే పేర్కొనడం గమనర్హాం..

● అస్తవ్యస్తంగా భీమ్‌గల్ మున్సిపాలిటీ

భీమ్‌గల్ మున్సిపాలిటీ అస్తవ్యస్తంగా మారింది. గతంలో పూర్తిస్థాయిలో మున్సిపల్ కమీషనర్ సుమారు ఏడాదిన్నర కాలంగా లేకపోవ



మున్సిపాలిటీ ముఖచిత్రం

డంతో పెద్దమొత్తంలో నిధులు దుర్వినియోగం అయ్యాయని గతంలో ఆరోపణలు వెల్లువెత్తాయి. నెలన్నర క్రితం భీమ్‌గల్ కమీషనర్ విధుల్లో చేరారు. టౌన్ ప్లానింగ్ అధికారి విధులకు తూతూ మంత్రంగా వస్తుండడంతో టౌన్ ప్లానింగ్ విభాగంలో అనుమతి లేకుండా కట్టడాలు నిర్మిస్తున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యారు. భీమ్‌గల్ చైర్మెన్ కుర్చీ ఇద్దరు పంచుకోవడంతో ఎవరి హాయంలో చేయాల్సిన అవినీతి వారు చేసుకొని వెళ్లారని ప్రజలు ఆరోపిస్తున్నారు. భీమ్‌గల్ మున్సిపాలిటీలో అక్రమ కట్టడాలు ఎన్నో నిర్మించినా కూడా ఒక్క నోటీసు కూడా మున్సిపల్ అధికారులు జారీ చేయలేదు. ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు లను కేటాయిస్తున్నారని అసెస్మెంట్ చేసేటప్పుడు అత్యధికంగా మున్సిపల్ శాఖ అధికారులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. ఇప్పటికైనా బీమ్‌గల్ మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి బాగోతంపై ఉన్నతస్థాయి అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేస్తే కోట్లలో జరిగిన అవినీతి బయట పడుతుందని ప్రజలు కోరుతున్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో ఫాసిస్టు బీజేపీని ఓడించండి


గడ్కోల్‌లో మాట్లాడుతున్న మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ

సిరికొండ ఏప్రిల్ 21 : మధ్య యుగాల నాటి మనువాద సిద్దాంతానికి అనుకూలంగా భారత రాజ్యాంగాన్ని మార్చి వేయడానికి కుట్రలు పన్నుతున్న బీజేపీకి వ్యతిరేకంగా ఓట్లు వేసి ఓడించాలని సీపీఐఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. సిరికొండ మండలం గడ్కోల్ గ్రామంలో మండల కార్యదర్శి అధ్యక్షతన జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ మతోన్మాదాన్ని ప్రోత్సాహిస్తున్న బీజేపీ నరేంద్రమోదీని ఓడించి ప్రజాస్వామిక లౌకిక విలువలను కాపాడుకోవడానికి ప్రజలు ముందుకు రావావాలన్నారు. అన్ని మతాలకు నిలయమైన భారతదేశంలో కేవలం ఒక మతాన్ని , కులాలను ప్రోత్సాహిస్తూ సమాజాన్ని చీలుస్తున్న బీజేపీని చిత్తు చిత్తుగా ఓడించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నేటి సమాజంలో అంటరాని సమాజం నుంచి వెలివేయబడ్డ వారు క్రిష్టియన్లుగా, ముస్లింలుగా చేరారని,నేడు బీజేపీ, ఆర్ఎస్ఎస్, దాని సంఘ్ పరివార శక్తులు ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ,చరిత్రకారులు,లౌకిక వాదులకు వ్యతిరేకమైన చర్యలు చేపట్టి విధ్వంస చర్యలకు పూనుకున్నారని ఆయన విమర్శించారు. బీజేపీ గెలిస్తే ఫాసిజం వస్తుందని దాని వల్ల బీజేపీ, ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ బృందం ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తాయిన్నారు.ప్రతిపక్షాల సీబీఐ,ఈడీ,ఐటీలను ఉపయోగించి అణిచివేస్తారని రామకృష్ణ గుర్తు చేశారు. ప్రశ్నించే రచయితలను, జర్నలిస్టులను అక్రమ కేసులు పెట్టి జైళ్లల్లో బందిస్తారని ఆయన అన్నారు.రామరాజ్యం తెస్తామని చెపుతూ హింసా కాండను తెరుస్తుందన్నారు. భారతదేశాన్ని కొంతమంది బడా పెట్టుబడిదారులకు అప్పగిస్తుందన్నారు. అందుకని రానున్న ఎన్నికల్లో బీజేపీ దాని మిత్రపక్షాలను చిత్తుగా ఓడించి ప్రజాస్వామిక లౌకిక శక్తులను గెలిపించాలని రామకృష్ణ ప్రజలను కోరారు.ఈ మావేశంలో దామోదర్,లింబాద్రి,కిషోర్,నారగౌడ్,ఈ.రమేష్,అనీష్,బాల్‌రెడ్డి,ఎర్రన్న,సాయిలురామన్న,ఎస్.కిషోర్ పాల్గొన్నారు.

మాటుకాలువలో బైక్ లభ్యం


నాళేశ్వర్ మాటు కాలువలో లభ్యమైన బైక్

నవీపేట,ఏప్రిల్21: మండలంలోని నాళేశ్వర్‌లోని మాటు కాలువలో ఆదివారం సాయంత్రం బైక్ లభ్యమైందని స్థానికులు తెలిపారు. మాటు కాలువలో పల్సర్ బైక్ పడి ఉండగా సమీపంలో ఎటువంటి ఆనవాలు కనిపించలేదని ఈ విషయంపై నవీపేట పోలీసులకు సమాచారం అందించడం జరిగిందని స్థానికులు తెలిపారు.

ఆలయ పునః నిర్మాణానికి భూమిపూజ


పెర్కిట్‌లో ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్21: ఆర్మూర్ పట్టణ శివారులోని వెంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు భూమిపూజ చేశారు. పెర్కిట్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని భక్తులు వీడీసీ ఆధ్వర్యంలో పునర్నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి, అయ్యప్ప శ్రీనివాస్, మానేటి లింబాద్రి, మూడ అశోక్, పట్టణ కౌన్సిలర్‌లు రింగుల భూషణ్, మురళీ, మామిడిపల్లి మాజీసర్పంచ్ మారుతిరెడ్డి, వీడీసీ అధ్యక్షుడు దేవేందర్, కోశాధికారి రాజుబాబు, గంగాధర్, శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కొనసాగిన బీఎల్‌వీ సెట్ ప్రవేశ పరీక్ష


డిచ్‌పల్లిలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 21: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల (బాలికల) ప్రతిభా పాఠశాల/కళాశాల ధర్మారం(బి)లో ఆదివారం టీఎస్‌డబ్ల్యూఆర్ఇఐఎస్, టీటీడబ్ల్యూటీఆర్ఇఐఎస్ బీఎల్‌వీ-సెట్ 2024 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు మొత్తం 321 మంది నమోదు చేసుకోగా 282 మంది హాజరుకాగా, 39 మంది గైర్హాజరైనట్లు సమన్వయకర్త బి.సంగీత తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాన్ని రీజియన్ ఆఫీసర్ కె.అలివేలు సందర్శించారు.

నేడు అవిశ్వాస పరీక్ష

ధర్పల్లి, ఏప్రిల్ 21: మండలంలోని హొన్నాజీపేట్ సొసైటీ చైర్మన్ రాజేందర్‌రెడ్డిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై సోమవారం అధికారులు సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సీఈవో గంగానర్సయ్య తెలిపారు. ఉదయం 10గంటలకు డీసీవో శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో సమావేశం జరుగనుంది. గత కొన్ని రోజుల క్రితం 9 మంది డైరెక్టర్లు డీసీవో శ్రీనివాస్‌రావుకు అవిశ్వాస తీర్మానం పత్రాన్ని అందజేశారు.

ప్రారంభమైన పెద్దమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠాపన

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 21: నగరంలోని దుబ్బ ప్రాంతంలో శ్రీ పెద్దమ్మతల్లి దేవాలయ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. నాలుగు రోజుల పాటు జరుగనున్న విగ్రహ ప్రతిష్ఠాపన, యంత్రప్రతిష్ఠ, ధ్వజాస్తంభ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, కుంభప్రోక్షణ కార్యక్రమాలను మధుసూదనానంద సరస్వతి చేతుల మీదుగా నిర్వహించనున్నారు. ఆదివారం అమ్మవారి విగ్రహాల ఊరేగింపు, గణపతిపూజ నిర్వహించారు. సోమవారం యాగశాల ప్రవేశం, నిత్యపూర్ణాహుతి, నవకలశ స్థాపన, పంచామృత అభిషేకం, మంగళవారం కుంభా ఆరాధన, మూల మంత్ర హవనము, బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొడవు శరత్ తెలిపారు. ఆదివారం ఆలయ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న జీవన్‌రెడ్డి

చిన్న పాటి వర్షానికే అధ్వానంగా మారిన రోడ్డు

ఏర్గట్ల, ఏప్రిల్ 21: చిన్న పాటి వర్షానికే ఏర్గట్ల మండలంలోని రోడ్లు అధ్వానంగా మారాయి. మండల కేంద్రం నుంచి మెట్‌పల్లి వెళ్లే రోడ్డులోని తీగల వాగు దాటిన తరువాత రోడ్డు చెడిపోయి చాలా రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గత రెండు మూడు రోజులు క్రితం కురిసిన తెలికపాటి అకాల వర్షానికే రోడ్డు బురదమయంగా మారడంతో ప్రయాణీకు లకు ఇబ్బందులు తప్పడం లేదు. అనునిత్యం వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నా సంబంధిత అధికారుల తీరు మాత్రం మార డం లేదు. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్ప డటంతో వాహనదారులు రోడ్డుపై వెళ్లాలంటే జంకుతున్నారు. తక్షణమే ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయా లని కోరుతున్నారు.


అధ్వానంగా మారిన మెట్‌పల్లి వెళ్లే రోడ్డు

అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేయాలి



మండల కేంద్రం నుంచి మెట్‌పల్లి వెళ్లే దారిలో రోడ్డు చెడిపోయి రోజులు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. నిత్యం వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. చిన్న పాటి వర్షానికే రోడ్డు మొత్తం బురదమయంగా మారి తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. వచ్చేది వర్షాకాలం కాబట్టి అధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తులు వెంటనే చేపట్టాలి.

- ఆనందం గంగేశ్వర్, గ్రామస్థుడు ఏర్గట్ల

సీఎం గారు వర్సిటీపై దృష్టిసారించాలి?

- నేడు జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి
- వర్సిటీ అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రకటనపై విద్యార్థులు ఆశలు


టీయూలోని బాలికల హాస్టల్

డిచ్‌పల్లి, ఏప్రిల్ 21: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం పేరుతో ఉన్న తెలంగాణ విశ్వ విద్యాలయం సమస్యలతో సతమతమవు తుంది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వర్సిటీ కి సరైనా స్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో వర్సిటీలో బాలికల హాస్టల్ లేక విద్యార్థినులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. 250మంది ఉండే ఈ భవనంలో 800మంది ఉంటున్నారు. వర్సిటీలో 21 కోర్సులు ఉన్న పూర్తి స్థాయి అధ్యాపకులు లేక విద్యారులకు బోధన అందడం లేదు. టీచింగ్ తో పాటు నాన్ టీచింగ్ లో ఖాళీలు గత పదేళ్లగా భర్తీ చేయకపోవడంతో వర్సిటీ విద్యా ర్థులకు, అనుబంధ కళాశాలలకు పూర్తి సేవలు అందించాలేని పరిస్థితి నెలకొంది. విద్యార్థులకు పోటీ పరీక్షలకు సిద్ధం మయ్యేందుకు పుస్తకాల కొరత వేదిస్తుంది. సైన్స్ భవన నిర్మాణ పనులు మూడేళ్లుగా నత్తనడకన సాగుతుండటంతో ప్రస్తుత ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. గత ఏడాది నుంచి వర్సిటీకి వైస్ చాన్సలర్ లేక పోవడంలో విద్యార్థుల కాన్వికేషన్ నిర్వాంచలేని పరిస్థితి నెలకొంది. ఇన్‌చార్జ్ వీసీ తోనే కాలం వెళ్ల దీస్తున్నారు. జిల్లా కు వస్తున్న సీఎం రెంవంత్‌రెడ్డి తెలం గాణ యూనివర్సిటీ అభివృద్ధికి 100కోట్ల రూపాయలు నిదులు మంజూరు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతు న్నారు.

● నూతన భవనాలు నిర్మించాలి

తెలంగాణ యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ భవనంలోనే ప్రస్తుతం వీసీ, రిజిస్ట్రార్ చాంబర్‌లతో పాటు ఆడిట్ సెల్ కార్యాలయం, పరీక్షల విభాగం బ్యాంకు, తపాల సేవలు, జమఖర్చుల కార్యాలయాలు కొనసాగుతుండటంతో పూర్తిగా ఇరుకుగా మారింది. ఫైళ్లు దాచేందుకు గదులు సరిపోకపోవడంతో ఆరుబయటనే ఉంచాల్సిన దుస్థితి నెలకొంది. ఇటీవల వర్సిటీ సందర్శనకు వచ్చిన ఇన్‌చార్జ్ వీసీ బుర్ర వెంకటేశం (ఐఏఎస్) ఆరుబయట ఉన్న ఫైళ్లను చూసి విస్మయం వ్యక్తం చేశారు. ఇక్కడ ఫైళ్లు ఎందుకు పెట్టారు అని సిబ్బందిని ప్రశ్నించగా గదుల్లో స్థలం సరిపోక ఇక్కడ ఉంచాల్సి వస్తుందని సిబ్బంది వీసీ కి తెలపడంతో ఆయన విస్మయం వ్యక్తం చేశారు. దీని బట్టి అర్థమవుతుంది. వర్సిటీ పరిపాలన భవనం పరిస్థితి కావున ఇప్పటికైన ఆడిట్‌సెల్, పరీక్షల విభాగం, కార్యాలయాలకు నూతన భవనాలు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, ఉద్యోగులు కోరుతున్నారు.

ఇలాంటివి తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఏన్నో మౌలిక వసతులు కొరత ఉన్నందున్న తెలంగాణ యూనివర్సిటీ పై నేడు జిల్లాకు వస్తున్న సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలని విద్యార్థులు కోరుతున్నారు.

● గవర్నర్ ఆదేశించిన మారని వర్సిటీ

తెలంగాణ యూనివర్సిటీని పూర్వ గవర్నర్ తమిళి సై సౌందర్ రాజన్ తెలంగాణ విశ్వవిద్యాలయాన్ని గతంలో రెండు సార్లు సందర్శించారు. వర్సిటీలోని అన్ని విభాగాలను హాస్టళ్లను సందర్శించారు. విద్యార్థులకు వర్సిటీలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన ఇంత వరకు పరిష్కారం కాలేవు. గవర్నర్ ఆదేంచిన తెలంగాణ యూనివర్సిటీ సమస్యలు తీరాని దుస్థితి రావడం బాధకరమని విద్యార్థులు వాపోతున్నారు.


టీయూ స్వాగత తోరణం


టీయూ పరిపాలక భవనం

నిశ్చితార్థ వేడుకల్లో స్పీకర్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 21: రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆదివారం నగరంలో జరిగిన నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ నాయకుడు గడుగు గంగాధర్ బంధువుల నిశ్చితార్థ వేడుక నగర శివారులోని ఓ హోటల్‌లో జరుగగా ఆ వేడుకకు స్పీకర్ హాజరై నూతన జంటను ఆశీర్వదించారు.


నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్

బాజిరెడ్డి ఎన్నికల ప్రచారం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 21: నిజామాబాద్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఐటీఐ గ్రౌండ్‌లో ఉదయం మార్నింగ్ వాకర్స్‌తో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అందరిని కలుస్తూ పలుకరించారు. కొద్దిసేపు క్రీడాకారులతో ఆటలు ఆడారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మెజార్టీతో తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ నీతూకిరణ్, సిర్పరాజు, సుజిత్‌సింగ్ ఠాకూర్, గాండ్ల లింగం, ప్రవీణ్, మహేందర్, నీలగిరి రాజు, వాకర్స్ అసోసియేషన్ నాయకులు పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.


క్రికెట్ ఆడుతున్న దృశ్యం



గణిత మేధావి శకుంతలదేవికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

శకుంతల దేవి స్ఫూర్తితో
గణితంపై ఆసక్తిని పెంచుకోవాలి

సిరికొండ ఏప్రిల్ 21 : విద్యార్థి దశ నుంచి గణితం పట్ల ఆసక్తితో క్లిష్టమైన సమస్యలకు సైతం అవలీలగా పరిష్కారం చెప్పగల ప్రతిభను పెంపొందించుకున్న శకుంతలదేవిని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని గణితంపై ఆసక్తిని పెంపొందించుకోవాలని సత్యాశోధక్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు నర్సయ్య కోరారు. ప్రపంచ ప్రసిద్ధ గణిత,ఖగోళ శాస్త్రవేత్త హ్యూమన్ కంప్యూటర్ శకుంతల దేవీ 11వ వర్థంతి సందర్భంగా ఆదివారం సిరికొండలో చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.నర్సయ్య మాట్లాడుతూ రోజువారి జీవితంలో గణితమే ఘనమైన పాత్ర పోషిస్తుందన్నారు.చుట్టూ ఉన్నదంత అంకెలు,సంఖ్యలు గణితమే అని ఐదో యేటనే సంక్లిష్ట మానసిక అంక గణితంలో నిపుణురాలిగా గుర్తింపు పొందినట్లు నర్సయ్య చెప్పారు.చిన్న వయస్సులో ఆమె క్యూబ్ మూలాలను లెక్కించడంతో పాటు గణిత పరిజ్ఞానాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప మేధావన్నారు.మైండ్ డైనామిక్స్ అని పిలిచే భావనను అభివృద్ధి చేసి మానవ కంప్యూటర్‌గా పేరు గాంచిన శకుంతల దేవీ అని కొనియాడారు. నేటి విద్యార్థులు గణితం పై ఉండే భయాందోళనలను వదులుకుని శకుంతల దేవిని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగారెడ్డి,అనిల్ , విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలూర్‌లో కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం


ఆలూర్‌లో దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్ 21: ఆలూర్ మండల కేంద్రంలో బీజేపీ, బీజేవైఎం మండలశాఖ ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఇటీవల ఆలూర్ మండల కేం ద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సీతమ్మను అసభ్య కరంగా చిత్రించి సోషల్ మీడియాలో పోస్టు పెట్టడం పట్ల వారు మండి పడ్డారు.హిందు దేవతాలను,ఆల యాలను అవమాన పరిస్తే సహిం చేదిలేదని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపా ధ్యక్షుడు చిత్తరంజన్‌రెడ్డి, జిల్లాప్రభారి నాయ కులు సంతోష్, రాజశేఖర్‌రెడ్డి, నాగసురేష్, మండల పార్టీ అధ్యక్షుడు గిరిష్, మలయ్య, ప్రళయ్‌తేజ్, మాక్లూర్ మండల అధ్యక్షుడు రాజశేఖర్, కంఠం సాయి, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లిలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం


ఖిల్లా డిచ్‌పల్లిలో పూర్వ విద్యార్థులు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 21: ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి వారంత ఒకే చదువులమ్మ బడిలో 2002-2003 లోవిద్యా అభ్యసించారు. 22ఏళ్ల అనంతరం వారంత ఆదివారం ఖిల్లా డిచ్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో తమ చదువు చెప్పిన గురువులతో కలిసి ఆత్మీ సమావేశం నిర్వహించుకున్నారు విద్యార్థులు. 20ఏళ్ల తర్వాత ఉద్యోగాల్లో స్థిరపడ్డ వారు కొందరు, వ్యాపారల్లో స్థిరపడ్డవారు కొందరు ఒకే తాటి పైకి వచ్చి ఆత్మీయ సమావేశంలో కలుసుకున్నారు. వారి కుటుంబాలను ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. అనంతరంలో అందరు కలిసి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీతయ్య, అవదేశ్, ధృకృత్ కుమార్, వెంకటేశ్వర్లు, షేక్ హైదర్, విజయలక్ష్మీ, దామోదర్, హరిచరణ్,జలందర్, పాల్గొన్నారు.

యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలపై రూరల్ ఎమ్మెల్యేకు వినతి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 21: తెలంగాణ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలపై టీయూ ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో ఆదివారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు వస్తున్నందున తెలంగాణ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. రూరల్ ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు శ్రీశైలం, బానోత్ సాగర్ నాయక్, ఆల్లూర్ రాజేందర్, నవీన్, మహేష్, కుశక్‌కుమార్, సాయిపవన్, తదితరులు ఉన్నారు.

నేటి నుంచి సలాబాత్‌పూర్ ఆలయంలో జాతర

మద్నూర్, ఏప్రిల్ 21: మూడు రాష్ట్రాల సరిహద్దులో కొలువైన అంజన్న భక్తుల కోరికలు తీరుస్తూ కొంగు బంగారంగా బాసిల్లుతున్నాడు. మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్‌లో కొలువై అశేష పూజలందుకుంటున్నాడు. మూడు రాష్ట్రాలైన కర్నాటక, తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని అంజన్నను కొలిస్తే కోరికలు తీరుస్తున్నాడని భక్తుల విశ్వాసం. అభయాంజనేయ స్వామి జన్మోత్సవానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. శతాబ్దాల చరిత్ర గల ఈ ఆలయానికి పరిసర, పొరుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది తరలివచ్చి పూజలు చేస్తుంటారు.

సమర్థ రామదాసు ప్రతిష్ఠించిన విగ్రహం

ఎంతో మహిమాన్వితుడిగా పేరున్న ఈ స్వామి ఆలయం మూడు రాష్ట్రాల సరిహద్దులో మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్‌లో ప్రాచీన కాలం నుంచి ఈ ప్రదేశం భక్తులకు కొంగు బంగారంగా నిలుస్తోంది. 400 సంవత్సరాల క్రితం ఏర్పడినట్లు చరిత్ర ఆధారాలు చెబుతున్నాయి. ఛత్రపతి శివాజీ మహరాజ్ గురువైన సమర్థ రామదాసు ఈ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు పూర్వీకులు చెబుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయడానికి కృషి చేస్తోంది. 9 కోట్లను కేటాయించి నూతన ఆలయ నిర్మాణానికి ఏర్పాట్లు చేయడంతో పాటు ఈ పాటికే కల్యాణ మండలం పనులు పూర్తయ్యాయి. ఇక్కడ ఆలయ నిర్వాహకులు దూర ప్రాంత భక్తులకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆంజనేయ స్వామి జన్మోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాట్లు చేయడంతో పాటు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఏర్పాట్లు చేశారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులతో కళకళలాడుతోంది. కుస్తీ పోటీలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. మూడు రాష్ట్రాల నుంచి ఆలయానికి భక్తులు రానుండటంతో అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.


ఆలయంలో హనుమాన్ మూలవిరాట్


ఆలయ ముఖ ద్వారం నుంచి వెళుతున్న భక్తులు


భిక్కనూరు వద్ద బోల్తా పడ్డ లారీ

భిక్కనూరు రహదారిపై లారీ బోల్తా

- కిలో మీటరు మేర ట్రాఫిక్ జాం

భిక్కనూరు, ఏప్రిల్ 21: 44వ జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు లారీ బోల్తా పడటంతో కిలో మీటర్ మేర ట్రాఫిక్‌జాం అయిన సంఘటన ఆదివారం రాత్రి భిక్కనూరు మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామం వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కామారెడ్డి వైపు నుంచి హైదరాబాద్ వైపు ఏషియన్ పేయింట్ పుట్టి లోడ్‌తో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు సిద్ధరామేశ్వరనగర్ గ్రామం వద్ద 44వ జాతీయ రహదారిపై డివైడర్ పైకి ఎక్కి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా దాదాపుగా కిలో మీటర్ మేర ట్రాఫిక్‌జాం ఏర్పడింది. వెంటనే ఈ విషయం తెలుసుకున్న భిక్కనూరు ఎస్సై సాయికుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పోలీసు, జీఎంఆర్ సిబ్బంది సహకారంతో ట్రాఫిక్‌ను పునరుద్ధరించి రోడ్డు మధ్యలో పడిన లారీని క్రెయిన్‌తో పక్కకు తీయించారు.


మహనీయుల జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

మహనీయులను స్మరించుకుందాం

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 21: పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఆదివారం ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహనీయుల జయంతి ఉత్సవాలను నిర్వహించారు. జ్యోతిరావుపూలే, బాబా సాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రాం చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు సంతోష్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయులను స్మరించుకుందామని విద్యార్థులకు సూచించారు. వారు చూపిన బాటలో నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ అధికారి గంగా సుధ, ఫౌండేషన్ సభ్యులు శ్రీదేవి, సాయికుమార్, విద్యార్థులు తదితరులున్నారు.


బాన్సువాడ మార్కెట్‌లో మటన్ విక్రయాలు కొనసాగుతున్న దృశ్యం

మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు బేఖాతరు

- యథేచ్ఛగా మాంసం విక్రయాలు

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 21: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో 21న మహావీర్ జయంతి సందర్భంగా జీవహింస చేయరాదని బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ అలీం మాంసం విక్రయదారులను హెచ్చరించారు. ఒకవేళ మాంసం విక్రయాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కానీ మాంసం విక్రయదారులు మాత్రం యథేచ్ఛగా మాంసం విక్రయాలు చేస్తూ మున్సిపల్ కమిషనర్ ఆదేశాలను బేఖాతరు చేశారు. వీరిపై కమిషనర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.


కామారెడ్డిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 21: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 2000-2001 విద్యా సంవత్సరంలో సీఎస్ఐ పాఠశాలలో చదివిన పదో తరగతి విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించి అలనాటి జ్ఞాపకాలను స్మరించుకుంటూ ఆనందంగా గడిపారు.


ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న పోచారం

భక్తి పారవశ్యంలో బాన్సువాడ

బాన్సువాడ, ఏప్రిల్ 19: బాన్సువాడ పట్టణంలో ప్రజలు భక్తికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారని, భక్తి పారవశ్యంలో బాన్సువాడ తరిస్తుందని శాసన సభ్యుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం తాడ్కోల్ డబుల్ బెడ్‌రూం ప్రాంతంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ప్రాంగణంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఆయన భక్తులనుద్దేశించి ప్రసంగించారు. బాన్సువాడలో ఆలయాల నిర్మాణం కోసం తాను ముందుంటానని, అందుకోసం తాను అన్ని రకాలుగా గుడులను అభివృద్ధి కోసం తగినన్ని నిధులను మంజూరు చేయడంలో అత్యంత ప్రాధాన్యతను కనబరుస్తానన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ వైస్ ఎంపీపీ

సదాశివనగర్, ఏప్రిల్ 21: మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ ఆకుల విఠల్ ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గతంలో కాంగ్రెస్ పార్టీచేసిన అభివృద్ధి పనులు,పేదల సంక్షేమం కాంగ్రెస్‌పార్టీతోనే కృషి జరుగుతుందన్న ఉద్దేశ్యంతో పార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు. గ్రామ సీనియర్ నాయకుడు ఆకుల వెంకటరాములు, వడ్లరవి తదితరులు పార్టీలో చేరగా ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అందరూ సమిష్టిగా కృషిచేసి పార్లమెంట్ ఎన్నికల్లో సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని అందుకోసం తమవంతు సహకారం గ్రామానికి ఎప్పుడు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి, సీనియర్ నాయకుడు సంకరి లింగం, సింగిల్‌విండో ఛైర్మన్ గంగాధర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని ఆదరించాలి

తాడ్వాయి: మండలంలోని చిట్యాలలో ఆదివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కే.మదన్‌మోహన్‌రావు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎల్లారెడ్డిలో భారీ మెజార్టీ రాబోతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపించాలన్నారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించడానికి కృషిచేస్తానన్నారు. అదేవిధంగా మాజీ సర్పంచ్ కవితబాలయ్యమరికొందరు బీఆర్ఎస్ నాయకులు పార్టీలో చేరగా ఎమ్మెల్యే వారికి కండువా కప్పిపార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో నాయకులు విఠల్, బాబు, ప్రభాకర్, ఎల్లాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ వైస్ ఎంపీపీ

సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 21: నిజామాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్ రెడ్డి నేడు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు నామినేషన్ సమర్పించనున్నారని ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, ముఖ్య అతిథిగా హాజరు అవుతున్నారని ఈ సందర్భంగా పాత కలెక్టరేట్ వద్ద నిర్వహించే బహిరంగ సభకు కాంగ్రెస్ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలి రావాలిన ఎమ్మెల్యే కోరారు. ఆదివారం స్థానిక విలేకర్లతో రూరల్ ఎమ్మెల్యేమాట్లాడుతూ.. సీఎం బహిరంగ సభకు ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలిచవచ్చి విజయవంతం చేయలని పిలుపునిచ్చారు. నిజామాబాద్ స్మార్ట్ సిటీ ఏర్పాటు చేయాలని నిజామాబాద్ నుంచి డిచ్‌పల్లి వరకు రింగ్ రోడ్డు ఏర్పాటు చేయాలని, తెలంగాణ యూనివర్సిటీ లో ఇంజనీరింగ్ కళాశాల, తెలంగాణ విశ్వవిద్యాలయంకు రూ.100కోట్లు, టీయూ పరిధిలోని కళాశాలల విస్తరణ, రైతుల పోడు భూముల సమస్యలు, నిరుపేదలకు 6వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు నిజామాబాద్ రూరల్‌లో రెండు పారిశ్రామిక వాడలు మంజూరు చేయాలని, సీఎం రేవంత్‌రెడ్డి కి వినతి పత్రం అందజేస్తామని ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. సెజ్ ల ఏర్పాటుతో ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందని, ఎమ్మెల్యే అన్నారు. విలేకర్ల సమావేశంలో పార్టీ ప్రతినిధులు అమృతపూర్ గంగాధర్, మో హన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వాసుబాబు, నవీన్‌గౌడ్, ముప్పగంగారెడ్డి పాల్గొన్నారు.

ధర్పల్లి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆదివారం ఉదయం గణపతి పూజ, మండపపూజ, యోగిని మండప పూజ, నవగ్రహ మండప పూజ, హోమము, విగ్రహాలకు మహాస్నానము, సా యంత్రం పలపుష్ప అధివాసాలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. 22న సోమవారం విగ్రహప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, బలిపూర్ణాహుతి, మధ్యాహ్నం అన్నప్రసాదన ఉంటుందని నిర్వహకులైన శాలివాహన సంఘ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, మాజీ సర్పంచ్ మిట్టపల్లి గం గారెడ్డి, కుమ్మరి గుండన్న, సురేందర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.


ధర్పల్లిలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 21: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గంజ్‌వర్తకసంఘ భవనంలో ఆదివారం ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగదేవత ప్రతిష్ఠాపన పూర్వక కుంభాభిషేకంతో పాటు 108 రకాల ద్రవ్యాలతో మహాపూర్ణహుతి నిర్వహించారు. 5 కిలోల వెన్నతో ఆంజనేయ స్వామికి అలంకరించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పురోహితులు రాజయ్యజ్యోషిరమేష్, గంజ్ వర్తకసంఘం అధ్యక్షుడు యాదరాజేశ్వర్‌నరావు, పార్శీరాజు, పాత వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

25న బాన్సువాడకు అమీత్‌షా రాక

బాన్సువాడ, ఏప్రిల్ 21: ఈ నెల 25న గురువారం బాన్సువాడకు కేంద్ర మంత్రి అమీత్‌షా రానున్నట్లు బీజేపీ శ్రేణులు ఆదివారం తెలిపాయి. ప్రచారంలో భాగంగా బీబీ పాటిల్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రచారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలను సమీకరించేందుకు బీజేపీ శ్రేణులు కసరత్తు మొదలు పెట్టారు.

హనుమాన్ శోభాయాత్రకు ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించరాదు : ఏసీపీ

ఖిల్లా, ఏప్రిల్ 21: జిల్లా కేంద్రంలో ఈనెల 23న నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా ప్రజలు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బం దులు కలిగించరాదని ట్రాఫిక్ ఏసీపీ ఎ.నారాయణ తెలిపారు. ట్రాఫిక్ పోలీసుల నిబంధనల ప్రకారం వాహనదారులు సూచనలు పాటించాలని తెలిపారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొననున్న నేపథ్యంలో తమ తమ వ్యాపారా సముదాయాల ముందు వాహనాలను రోడ్లపై నిలపవద్దని ఆయన తెలిపారు. ఈ యాత్ర సాగే లలితామహల్ థియేటర్, గంజ్‌గేట్ నెంబర్-2, గోదాంరోడ్, దేవిరోడ్, గాంధీచౌక్, నెహ్రూపార్క్, పెద్దబజార్, ఆర్ఆర్ చౌరస్తా వరకు దుకాణాల యజమానులు, ప్రజలు రోడ్లపక్కన వాహనాలు నిలపరాదన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ బ్యాడ్మింటన్ నూతన కార్యవర్గం ఎన్నిక

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 21:కమ్మర్‌పల్లి గ్రీన్‌ఫీల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ (కేజీబీఏ)పాలకవర్గం నూతన కార్యవర్గం ఆదివారం మండలకేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గజ్జెల శ్రీని వాస్, ఉపాధ్యక్షుడిగా మద్దికుంట సజ్జన్ , ఈగ శ్రీధర్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా రెంజర్ల మహేందర్, కార్యదర్శిగా సామనరేష్ రెడ్డి, కోశాధికారిగా అచ్చ విజయభాస్కర్, సలహాదారులుగా లోలపు సుమన్, గుండోజి భరద్వాజ్, అంతకు ముందుసభ్యుతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

హనుమాన్ జయంతి ఉత్సవాలు ప్రారంభం


బోధన్ హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్21: బోధన్ పట్టణంలోని మారుతీ మందిరంలో చైత్ర పౌర్ణమి సందర్భంగా ఆదివారం నుండి హనుమాన్ జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయని వేద పండితులు ప్రవీణ్ మహరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చనలు, అభిషేకాలు, గణపతిపూజ, స్వస్తి పుణ్యావచనము, ఆదిదేవత నవగ్రహ పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరంలో ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శివనామ సప్తాహ

బోధన్‌రూరల్,ఏప్రిల్21: బోధన్ పట్టణంలోని శ్రీ ఏకచక్రేశ్వరాలయంలో 19వ అఖండ శివనామ సప్తాహ ఆదివారం రెండవ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేక అర్చనలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. పరమరహస్య పారాయణ పఠనము నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ 108 షటస్థల బ్రహ్మ రాజశేఖర్ గురు లింగ శివాచార్య స్వామిజీ అహ్మద్‌పూర్ పీఠాధిపతులు ప్రవచనలు చేశారు. ప్రతి ఒక్కరు భక్తిమార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజ్ ప్రతినిధులు శంకరప్ప, రాజేశ్వర్ పటేల్, అజయ్‌కుమార్, విఠలప్ప, యాదవ్ రావు, ప్రభు అప్ప, శివ చెన్నప్ప, నితిన్, దిలీప్ కుమార్, రాజు, శివకుమార్ పాల్గొన్నారు.


ఆలయంలో సప్తాహ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

సీఎం సభకు తరలిరావాలి

జక్రాన్‌పల్లి, ఏప్రిల్21: నిజామాబాద్‌లో సోమవారం జరిగే సీఎం రేవంత్‌రెడ్డి సభకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, అధిక సంఖ్యలో తరలిరావాలని జక్రాన్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి నామి నేషన్ వేస్తున్న సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు.

జక్రాన్‌పల్లిలో జాతర ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్21:జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో ఆదినాథ స్వామి దేవాలయం జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం య జ్ఞం, స్వామివారి పల్లకి సేవను ఊరేగించారు. సోమవారం స్వామి వారి ప్రత్యేక పూజలు, రాత్రి 10గంటలకు ఆలయం వద్ద సాంస్కృతిక కార్య క్రమాలు, దొంగల దోపు కార్యక్రమం, 23న రాత్రి 12 గంటలకు స్వామి వారి రథోత్సవం, 24న చక్రతీర్థం, 25న స్వామివారి నాగవెళ్లి కార్యక్ర మాలు జరుగుతాయని దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

సిరికొండ, ఏప్రిల్ 21: సిరికొండ మండలం దూప్యానాయక్ తాండాలో ఆదివారం సాయంత్రం విద్యుదాఘాతానికి నవీన్ (35) అనే యువకుడు మృతి చెందాడు. ఎస్సై రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దూప్యానాయక్ తండాలో తన ఇంటి వద్ద మొరం నింపుతుండగా ట్రాక్టర్ బోల్తా పడింది. బోల్తాపడిన ట్రాక్టర్‌ను పైకి లేపుతున్న సమయంలో నవీన్ చేతిలో ఉన్న రాడ్ విద్యుత్ వైర్లకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నవీన్‌కు భార్య స్వప్న, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని శవపంచనామా చేసి పోస్టు మార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ముగిసిన పెద్దమ్మ ఉత్సవాలు

దోమకొండ, ఏప్రిల్ 21: మండల కేంద్రంలోని వనదుర్గ పెద్దమ్మ ఉత్సవాలు ఆదివారం ముగిసినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ పున్న లక్ష్మణ్ తెలిపారు. ఆలయంలో అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి తిరుగు బోనాల కార్యక్రమం జరిగిందన్నారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.


దోమకొండలో పెద్దమ్మ తిరుగు బోనాలు

చాముండేశ్వరీ దేవాలయ రాజగోపుర శిఖర ప్రతిష్ఠాపన

దోమకొండ మండల కేంద్రంలోని చాముండేశ్వరీ దేవాలయ రాజగోపుర శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమం 22 సోమవారం నుంచి 28 ఆదివారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఈవో ప్రభు, ఛైర్మన్ పాలకుర్తి శేఖర్ తెలిపారు. 22న వర్ణపూజ, 23న శాంతి పఠనం, 24న రాజగోపుర శిఖర స్థిర యంత్ర ప్రతిష్ఠ, 25న అష్టోత్తర (108) కలశ మహా కుంభాభిషేకం, 26న సామూహిక సత్యనారాయణ వ్రతం, 27న సంకష్టహర గణపతి 8వ వార్షికోత్సవం, 28న సిద్ధి, బుద్ధి సమేత సంకష్ట గణపతి గ్రామ పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాధాలు స్వీకరించాలన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

థియేటర్	సినిమా
దర్శన్	మనజుమిల్ బాయ్స్
శాంతి	టిల్లు స్క్వేర్
ప్రియా 70	ది ఫ్యామిలీ స్టార్
ప్రియా 35	గీతాంజలి మళ్లీ వచ్చింది

బాన్సువాడ

థియేటర్	సినిమా
మహేశ్వరి	టిల్లు స్క్వేర్
వెంకటేశ్వర	పారిజాత పర్వం

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

